# ఏప్రిల్ ఫూల్



పరంధామయ్యగారి ముద్దుల మనవడు 'సత్యనారాయణ'. పరంధామయ్యగారు మాత్రం ముద్దుగా 'బన్నీ' అని పిలుస్తారు. బన్నీ పదవ తరగతి చదువుతున్నాడు. చాలా తెలివైన విద్యార్థి. స్కూలులో అన్నిటిలోను ఫస్టు.

ప్రతిరోజు సాయంత్రం బన్నీ స్కూలు నుంచి రాగానే స్కూలులో జరిగిన విషయాలన్నీ పరంధామయ్యగారికి పూసగుచ్చినట్లు చెబుతాడు. అదంతా విని పరంధామయ్యగారు తన చిన్ననాటి విషయాలు గోరంతలు కొండంతలు చేసి గొప్పగా బన్నీకి చెప్పేవారు. ఒక్కొక్కసారి తాతగారు చెప్పినవన్నీ అబద్ధా లనిపించి బోరుకొట్టేవి. ఎలాగైనా తాతగారి గర్వం అణచాలని అనుకున్నాడు.

ఆరోజు బన్నీ, వాళ్ళ నాన్నగారు, అమ్మగారు, తాతగారు వరండాలో కూర్చుని సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్ళ తాతగారు తన చిన్నతనంలో అందరినీ ఎలా ఫూల్ చేసిందీ చాలా గొప్పగా చెబుతున్నారు. అది వింటున్న బన్నీ –

"తాతగారండి, ఈసారి ఏప్రిల్‌కి మిమ్మల్ని ఎలాగైనా ఫూల్‌ని చేస్తాను" అన్నాడు పట్టుదలగా.

ఆ మాటలకు అమ్మ, నాన్నగారు కయ్యిమంటూ అంతెత్తు లేచారు. నాన్నగారు, "ఒరేయ్ నీకు బుద్ధి వుందా? తాతగారిని ఫూల్‌ని చేస్తావా? తప్పు కదూ" అని మందలించారు. తాత మాత్రం చిరునవ్వు నవ్వుతూ 'మీ నాన్న కూడా ఇలానే నాతో అన్నాడు. కాని నన్నేమీ చెయ్యలేకపోయాడు" అన్నారు. ఆ మాటకు బన్నీ పట్టుదల రెట్టింపయింది. "సరే తాత గారూ! నేను ఏప్రియల్ ఫస్ట్‌కి మిమ్మల్ని ఫూల్‌ని చేస్తే మీరు నాకు వాచీ కొనిపెట్టాలని పందెం- సరేనా?" అన్నాడు. తాత ఒప్పుకున్నారు.

ఏప్రియల్ ఫస్ట్ ఇంకా మూడురోజులే వుంది. బన్నీ బాగా ఆలోచించి పథకం వేసాడు.

ఆరోజే ఏప్రిల్ ఫస్ట్! బన్నీ, తాతగారు వరండాలో కూర్చుని వున్నారు. బన్నీ ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లున్నాడు. తాతగారు 'వీడు నన్ను ఇంకా ఫూల్‌ని చేయలేదేంటి! పాపం మర్చిపోయినట్లున్నాడు' అనుకుంటూ "ఏం బన్నీ, పందెం మర్చిపోయావా?" అని అడిగారు. "అదే ఆలోచిస్తున్నా తాతగారూ" అన్నాడు బన్నీ సీరియస్‌గా. తాతగారు పకపక నవ్వుతూ "అలాగే ఆలోచిస్తూ వుండు" అన్నారు.

ఇంతలో వీధిగుమ్మం ముందు పోస్ట్‌మేన్ సైకిలాగింది. బన్నీ ఒక్క అంగలో గేటు దగ్గరకి వెళ్ళి పోస్టు తీసుకుని వచ్చి తాతగారికి ఇచ్చాడు. తాతగారు ఆ ఉత్తరంపైన తన పేరు వుండడం చూసి కళ్ళజోడు సవరించుకుంటూ ఉత్తరం చించారు. లోపల నుంచి ఒక తెల్లకాగితం తీసి చదివి ఒక్కక్షణం అలాగే వుండి పోయారు. ఆ తర్వాత బన్నీని చూసి "ఓరి ఘటికుడా, నన్నే ఫూల్‌ని చేసావురా!" అన్నారు తెల్లని మీసాల మధ్య నవ్వు దోబూచులాడుతుండగా.

ఇంతకీ ఆ ఉత్తరంలో ఏముంది?

"ఈ ఉత్తరం చదివినవారు ఏప్రియల్ ఫూల్" అని పెద్ద అక్షరాలతో రాసివుంది. దాని క్రింద,

మీ ప్రియమైన సత్యనారాయణ (బన్ని) అని వుంది.

ఆరోజు సాయంత్రమే బన్నీని తీసుకుని బజారువెళ్ళి వాచీ కొనిపెట్టారు-పాపం-మనవడి చేతిలో ఏప్రియల్ ఫూల్ అయిన తాతగారు.

—జి.వి.ఆర్. ప్రసాద్

## కాలమ్ దాటని కథ

ఒకరోజు సాయంత్రం మా పెండ్లి అయిన క్రొత్తలో మావారు ఆఫీసు నుంచి వచ్చి తనకు రాత్రి డిన్నర్‌కు ఆమ్లెటు వేయాలి అని ఆర్డర్ వేశారు! అసలే పచ్చి శాకాహారిని అయిన నేను గ్రుడ్డు సొడ గిట్టక ససేమిరా చేయనని మారాం చేశాను. దానితో ఆయన సీరియస్ అయిపోయి ముందుగదిలో సిగరెట్టు కాలుస్తూ, ఆలోచిస్తూ నుదురు మీద మోచేయి వేసుకుని పడక కుర్చీలో మాట్లాడకుండా కూర్చున్నారు. సినిమాల్లో చూపినట్టు, నవలల్లో వర్ణించినట్టు, నా స్నేహితురాళ్ళు చెప్పిన అనుభవంతో, చిలిపితనం, గారాబంతో భర్త కోపం పోగొట్టవచ్చని మెల్లిగా వెనక్కివెళ్ళి ఆయనకు చక్కిలిగింత పెట్టాను. దానితో మరీ సీరియస్ అయిపోయి మొహం ఎర్రగా మారగా నా కుడి చెంప ఛెళ్ళుమనిపించారు!! అనుకోని హఠాత్ పరిణామానికి నా చెంప బూరెలా వాచి కళ్ళలో నీరు చిప్పిల్లింది. గిరుక్కున వెనక్కు తిరిగి పడక గదిలోని మంచంపై ఏడుస్తూ పడిపోయాను. ఆ రాత్రి మా ఇద్దరికీ శివరాత్రి



### ఆమ్లెట్

జాగారం!

ప్రొద్దున్నే ఆయన నీటుగా తయారై టూత్‌బ్రష్, పేస్టు, టీ, బిస్కెట్‌తో నవ్వుతూ ప్రత్యక్షమయ్యారు! "నిన్న కొట్టింది ఇక్కడేనా" అంటూ చెంపపై ముద్దుల వర్షం కురిపిస్తూ గాఢంగా కౌగిలించుకున్నారు. 'క్షణక్షణం మారున్ మగవారి చిత్తముల్!' అనుకుని భయంతో, సిగ్గుతో నవ్వుతూ గువ్వలా ఒదిగిపోయాను. ఇన్నేళ్ళు కాపురం చేసినా, ఇంత వయసు వచ్చినా ఎప్పుడైనా ఆయన కోపంతో వున్నప్పుడు ఆ సంఘటన తలచుకొని కుడి చెంప నిమురుకుంటూ హాయిగా నవ్వుకుంటాము. ఆయన దగ్గర ఎంత చనువు పెరిగినా సీరియస్‌గా వున్నప్పుడు దగ్గరకు పోవడం అంటే ఇప్పటికీ భయమే!!

—శారదకృష్ణ